
ప్రజాశక్తి
శనివారం 14 జనవరి 2023 5
శ్రీ సత్యసాయి





అభివాదం చేస్తున్న విద్యార్థి, యువజన సంఘం నాయకులు

# ప్రశ్నించేందుకే సమరయాత్ర

◆ ప్రత్యేక హోదా, విభజన హామీల కోసం పోరాటం

◆ రౌండ్‌టేబుల్ సమావేశంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

**ప్రజాశక్తి-హిందూపురం**

విభజన హామీలు, ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ వైఖరిని ప్రశ్నిస్తూ సమరయాత్రను నిర్వహిస్తున్నట్లు విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పేర్కొన్నారు. వామపక్ష విద్యార్థి, యువజన ప్రజా సంఘాలు, ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 20న హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు తలపెట్టిన బస్సుయాత్రను విజయవంతం చేద్దామని కోరుతూ శుక్రవారం నాడు పట్టణంలోని ఎన్జీవో హోంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వామపక్ష విద్యార్థి, యువజన, ఎన్ఎస్‌యుఐ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని సరిచేసి, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఆవిషయాన్ని పట్టించుకోలేదన్నారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలోని ఏడు జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీతో పాటు కొత్త రాజధాని అభివద్ధి కోసం నిధులు, పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువత కోసం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. ఉపాధ్యాయ, కార్మిక, రైతు, ప్రజా ఉద్యమాలను అణచివేసేందుకు అక్రమ కేసులు బనాయించి రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విభజన చట్టంలోని హామీల కోసం సమర శంకరావాన్ని ఈ నెల 20 తేదీ నుండి ఫిబ్రవరి 5 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు జరిగే బస్సుయాత్రను జయప్రదం చేయడానికి ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీ నాయకులు, విద్యార్థి, యువజన సంఘాలు ఏకమై ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి యువజన సంఘాల నాయకులు బాబావలి, చంద్రశేఖర్ రెడ్డి, సంపత్ రవికుమార్, అభిలాష్, మూర్తి, చంద్రశేఖర్, హర్ష కుమార్, వంశీ, భగత్, అభి, చరణ్, ఎఐటియుసి నాయకులు శివప్ప, బాబు, వినోద్ కుమార్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

# అన్నీ చేస్తున్నారట..!

◆ కౌలు రైతుల సాయంపై అధికారుల బుకాయింపు ◆ గణాంకాలు చూపడంలో గోప్యత



**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

కౌలు రైతులకు గుర్తింపు లేదన్న ప్రజాశక్తి కథనం అవాస్తమంటూ అనంతపురం, సత్యసాయి జిల్లా వ్యవసాయాధికారుల రిజాండర్ ఇచ్చారు. కౌలు రైతులకు గుర్తింపునిస్తున్నామని, పంట రుణాలు, సబ్సిడీ విత్తనాలు అన్ని రకాలుగా అందుతున్నట్టు శుక్రవారం నాడు వివరణిచ్చారు. అయితే ఎంత మందికిచ్చారు.? ఎక్కడిచ్చారన్న వివరణ మాత్రం ఇవ్వకుండా అన్నీ చేసామంటూ బుకాయింపుతోనే సరిపెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

**గతేడాది ఇచ్చినకార్డులనూ కలిపి ఎక్కువ చూపించే ప్రయత్నం**

2022-23 సంవత్సరానిగానూ అనంతపురం జిల్లాలో 2657 సిసిఆర్‌సి కార్డులిచ్చినట్టు ఈనెల 7వ తేదీన జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులకు ఇచ్చిన నివేదికల్లోనూ చూపించారు. అయితే వివరణలో మాత్రం 7500 సిసిఆర్‌సి కార్డులిచ్చామని ప్రకటించారు. వాస్తవానికి ఈ లెక్కలు ఈ ఏడాదికి సంబంధించినవి కావు. 2019వ సంవత్సరం నుంచి ఇచ్చిన సిసిఆర్‌సి కార్డులన్నింటినీ కలిపి ఈ ఏడాది 7500 కార్డులిచ్చినట్టు వివరణలో పేర్కొనడం గమనార్హం. కౌలు గుర్తింపు కార్డులు ఒక్క ఏడాది కాల పరిమితితోనే ఇస్తారు. మరో ఏడాది పొడిగించాల్సి ఉంటే రెన్యూవల్స్ చేయాల్సి ఉంటుంది. రెన్యూవల్స్ చేసిన గణాంకాలేవి అధికారుల వద్ద లేవు. పాతలెక్కలను అన్నీ కలిపి మొత్తం 7500 ఇచ్చినట్టు చెబుతున్నారు. ఇందులో ఎంత మంది ఉన్నారో లేదో అన్న వెరిఫికేషన్ కూడా చేయలేదు.

**ఒక్కరీ అందని పంటరుణం**

గుర్తింపు పొందిన కౌలు రైతులకు 2022-23 సంవత్సరంలో అనంతపురం జిల్లాలో ఒక్కరీ పంటరుణమివ్వలేదు. అయితే అధికారులు మాత్రం పంటరుణాలిచ్చినట్టు వివరణలో పేర్కొన్నారు. నేరుగా పంటరుణాలివ్వడంలో సమస్య ఉందని జెఎల్‌జి (జాయింట్ లయబుల్ గ్రూపు) ద్వారా ఇస్తుంటారు. నలుగరు, ఐదుగురు కౌలు రైతులకు కలిపి ఒక గ్రూపుగా తయారు చేస్తారు. ఈ గ్రూపునకు రుణమిస్తారు. ఈ రకంగా చూసుకున్నా రైతులకు ఇచ్చింది పిసరంతే. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఒక గ్రూపునకు రూ.1.15 లక్షలు మాత్రమే ఇచ్చారు. దీన్నే అధికారులు జిల్లాలోని కౌలు రైతులందరికీ రుణాలిచ్చినట్టు చెబుతున్నారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి.

**అందని పరిహారం**

కౌలు రైతులకు పంటనష్టపోతే ఒక్క రైతుకు పరిహారం అందిన దాఖలాల్లేవు. ఉదాహరణకు విడపనకల్లు మండలంలోని ఆర్‌కొట్టాల గ్రామం పరిధిలో అత్యధికంగా కౌలు రైతులున్నారు. ఈ గ్రామంలో 2021లో అధిక వర్షాలకు మిర్చి పంట పూర్తిగా దెబ్బతింది. కాని ఒక్క రైతుకు పరిహారం అందిన దాఖలాల్లేవు. అదే రకంగా వజ్రకరువూరు మండలంలోని పొట్టిపాడులోనూ మిర్చి రైతులు నష్టపోయారు. వారికి పరిహారం అందలేదు. ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామంలో 42 మంది రైతులకు సిసిఆర్‌సి కార్డులూ ఇచ్చారు. వీరిలోనూ ఎవ్వరికి పరహారం అందలేదు. కనీసం సబ్సిడీ విత్తనాలు సైతం అందిన దాఖలాల్లేవు. కాని అధికారులు మాత్రం కౌలు రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నట్టు వివరణివ్వడం గమనార్హం. 2021 సంవత్సరంలో మాత్రమే సబ్సిడీ విత్తనమిచ్చారు. 2022 ఖరీఫ్‌లోగాని, రబీలోగాని జిల్లాలో ఒక్క కౌలు రైతుకు సబ్సిడీ విత్తనమివ్వలేదు.

# పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందాం

## యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు

**ప్రజాశక్తి- ధర్మవరం టౌన్**

పీడీఎఫ్ ఎమ్మెల్సీలు, యూటిఎఫ్, ఎస్‌టియు, ఇతర ప్రజా సంఘాలు బలపరిచిన రాయలసీమ పట్ట భద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఎన్జీవో హోంలో రాజ్యాంగ విలువలు, ప్రజాతంత్ర హక్కులను కాపాడుకుందాం అనే అంశంపై యుటిఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్.జయచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, లౌకిక విధానం ప్రమాదంలో పడ్డాయని తెలిపారు. ప్రజాతంత్ర హక్కులు, ప్రశ్నించే తత్వం స్వేచ్ఛగా ప్రదర్శనలు చేయకుండా నిషేధం, సాధారణ నిరసనలను సైతం తెలియజేసే ప్రజాస్వామ్య వాతావరణం కూడా లేని పరిస్థితులు నేటి ప్రభుత్వ పాలకులు తెచ్చిపెట్టారని తెలిపారు. ప్రజాతంత్ర హక్కులని కాపాడుకోవడం కోసం పీడీఎఫ్, యూటిఎఫ్, ప్రజా సంఘాలు నిలబెట్టిన పశ్చిమ రాయలసీమ టీచర్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, గ్రాడ్యుయేట్ అభ్యర్థి పోతుల నాగరాజులకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకోవాలని తెలియజేశారు. రాష్ట్రంలో విద్యా రంగంలో సంస్కరణల పేరుతో పాఠశాలలు విలీనం, ఉపాధ్యాయుల సంఖ్యని కుదించడం లాంటి చర్యలను ప్రభుత్వం చేస్తోందని తెలిపారు. సంస్కరణలు అభివద్ధికి ఉపయోగపడాలి తప్పా, విద్యా విధానం పతనంకు కారణం కాకూడదన్నారు. పాదయాత్ర సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిలబెట్టుకోలేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికీ రూ.1848 కోట్లు బకాయిలు చెల్లించలేదని విమర్శించారు. పశ్చిమ నియోజకవర్గ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు, పట్టభద్రుల సమస్యల పరిష్కరించడానికి తమవంతు కషి చేస్తామన్నారు.



ప్రజాతంత్ర హక్కులను కాపాడుకుందాం అంశంపై కరపత్రాలను విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఎన్నికల్లో తమను గెలిపించి ఆదరించాలని కోరారు. యూటిఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. మున్సిపల్ ప్రదానోపాధ్యాయులకు డిడిఓ పవర్స్ ఇవ్వాలని కోరారు. యూటీఫ్ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.జయచంద్రారెడ్డి, కె.నాగేంద్ర మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి యుటిఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ నిజాయితీ, నిబద్ధతగా పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ప్రజా పక్షమై ఉంటారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వీరికి మద్దతు ఇచ్చి, అత్యధిక మెజారిటీతో గెలిపించి ప్రజా తంత్ర ఉద్యమాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జెవివి నాయకులు ఆదిశేషులు, యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.భూతన్న, సహాధ్యక్షులు జిహెచ్.బాబు, కోశాధికారి ఎం.సుధాకర్, జిల్లా కార్యదర్శులు సి.తాహెర్ వలి, డి.శ్రీనివాసులు, ఈ.నారాయణ స్వామి, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.ఆంజినేయులు, రామకృష్ణ నాయక్ వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'పురం'లో కొట్టుకున్న కౌన్సిలర్లు

◆ నడిరోడ్డుపై అధికార పార్టీ నేతల బాహాబాహి

◆ హిందూపురంలో రచ్చకెక్కిన విభేదాలు

◆ ఇంటి నిర్మాణ విషయంలో ఘర్షణ

◆ ఛైర్‌పర్సన్‌పై అసమ్మతి కౌన్సిలర్ల దురుసు ప్రవర్తన



రోడ్డుపై కొట్టుకుంటున్న వైసిపి కౌన్సిలర్లు



వివాదానికి కారణమైన ఇల్లు ఇదే...

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం అధికార పార్టీలో అసమ్మతి మరోసారి రచ్చకెక్కింది. ఈ సారి ఏకంగా ఆ పార్టీ కౌన్సిలర్లు నడిరోడ్డుపై ఒకరిపై ఒకరు బాహాబాహికి దిగారు. ఓ ఇంటి నిర్మాణ విషయంలో అందరూ చూస్తుండగానే రోడ్డుపై ఇద్దరు నేతలు తన్నుకున్నారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న ఈ ఘటనలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం అయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసు స్టేషన్‌లోనూ ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...

హిందూపురం పట్టణంలోని బుక్కడిపేట 5వ వార్డుకు చెందిన ఇర్షాద్ అహ్మద్ 29వ వార్డులో ఓ ఇంటిని నిర్మాణం చేస్తున్నారు. ఈయన మూడు అడుగుల రోడ్డును ఆక్రమించుకుని ఇల్లు నిర్మిస్తున్నారని అధికార పార్టీకి చెందిన 29వ వార్డు కౌన్సిలర్ రోషన్ అలీ మున్సిపల్ అధికారులు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఛైర్‌పర్సన్ ఇంద్రజ పరిశీలన చేసి నిజంగా ఆక్రమణ జరిగి ఉంటే తొలగించాలని అధికారులకు సూచించారు. దీంతో అధికారులు పరిశీలన చేసి ఆక్రమణ జరిగిందని నిర్ధారణ చేశారు. ఈ మేరకు ఆక్రమణల తొలగింపునకు శుక్రవారం జెసిబిలను తీసుకుని తొలగించడానికి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, పోలీసుల సహాయంతో ఆ ప్రాంతానికి వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న 5వ వార్డు కౌన్సిలర్ ఇర్షాద్ అహ్మద్ అక్కడికి చేరుకున్నారు. 29వ వార్డు కౌన్సిలర్ రోషన్ అలీ రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణం చేస్తే లేని అభ్యంతరం ఇతరులకు ఎందుకు వర్తింస్తుందని అధికారులను ప్రశ్నించారు. కాలనీల్లో అన్ని ఇళ్లు ఎక్కడి వరకు ఉన్నాయో ప్రస్తుతం నిర్మాణం అవుతున్నా ఇల్లు కూడా అక్కడే ఉందని పేర్కొన్నారు. ఇలా ఈ విషయంపై ఇద్దరు కౌన్సిలర్లు ఒకరిపై ఒకరు పెద్ద ఎత్తున దూషణలు చేసుకున్నారు. ఇది కాస్త పెరిగి ఒకరిపై ఒకరు భౌతికంగా దాడులు చేసుకున్నారు. నడిరోడ్డుపైనే ఇద్దరు కొట్టుకున్నారు. అక్కడే ఉన్న పోలీసులు కలగజేసుకుని ఇద్దరికీ సర్దిచెప్పడంతో అప్పటికి గొడవ సద్దుమణిగింది.

**ఛైర్‌పర్సన్ ఛాంబర్ వదద ఆందోళన**

ఇర్షాద్ అహ్మద్‌కు మద్దతుగా పదిమంది వైసిపి అసమ్మతి కౌన్సిలర్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ ఛాంబర్ వద్దకెళ్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత పార్టీ కౌన్సిలర్ ఇల్లు నిర్మాణం చేసుకుంటుండగా, నిర్మాణాన్ని కూల్చడానికి జెసిబి పంపడం ఏమిటని ఛైర్‌పర్సన్‌ను నిలదీశారు. సమస్య ఉంటే ఇద్దరు కౌన్సిలర్లను పిలిపించి మాట్లాడాల్సింది పోయి ఇలా కక్షలు రేపే విధంగా ఇల్లు కూల్చడానికి జెసిబిలను పంపడం ఏమిటని ప్రశ్నించారు. ఇదే క్రమంలో కౌన్సిలర్ శివ, ఛైర్‌పర్సన్ ఇంద్రజ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కౌన్సిలర్ శివ తనను ఏకవచనంతో మాట్లాడి అగౌరవపరిచారంటూ ఛైర్‌పర్సన్ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆమె అక్కడ నుంచి వెళ్లిపోయారు.

**ఛైర్‌పర్సన్ భర్త హల్‌చల్**

ఛైర్‌పర్సన్‌పై దూషణల విషయాన్ని తెలుసుకున్న ఆమె భర్త తన మద్దతుదారులతో కలిసి మున్సిపల్ కార్యాలయం వద్దకు వచ్చారు. అక్కడున్న అసమ్మతి వర్గం కౌన్సిలర్లతో వాదనకు దిగారు. మహిళ అని చూడకుండా ఎలా అవమానకంగా మాట్లాడతారంటూ కౌన్సిలర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఛైర్‌పర్సన్‌ను దురుసుగా మాట్లాడే లేదని, ఇంటి నిర్మాణ విషయంపై మాత్రమే ప్రశ్నించామని అసమ్మతి కౌన్సిలర్లు సమాధానం ఇచ్చారు. అధికార పార్టీలో ఉంటూ బెదిరించాలని చూస్తే తమకు కౌన్సిలర్ పదవులే అవసరం లేదని అసమ్మతి కౌన్సిలర్లు పేర్కొన్నారు. వెంటనే పదవులకు రాజీనామా చేస్తామని 15 మంది కౌన్సిలరు ప్రకటించారు. ఈ వాదనల నడుమ ఛైర్‌పర్సన్ భర్త అక్కడినుంచి వెళ్లి పోయారు.

**పోలీసు స్టేషన్‌కు పంచాయతీ**

అధికార పార్టీ నేతల బాహాబాహి వ్యవహారం పోలీసు స్టేషన్‌కు చేరింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలర్ శివపై ఫిర్యాదు చేశారు. తన ఛాంబర్లోనే తనను ఇష్టారాజ్యంగా మాట్లాడటంతో పాటు దురుసుగా వ్యవహారించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఛైర్‌పర్సన్ కేసు పెట్టారన్న విషయం తెలుసుకున్న అసమ్మతి వర్గం కౌన్సిలర్లు అంతా స్టేషన్‌కు చేరుకున్నారు. ఛైర్‌పర్సన్ భర్త అనుచరులతో మున్సిపల్ కార్యాలయానికి వచ్చి బెదిరింపులకు దిగారని, తమ వర్గీయుడు నవీన్‌ను దూషించారని ఫిర్యాదు చేశారు. పోలీసులు రెండు వర్గాల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. కాగ ఈ వ్యవహారం వైసిపి పరిశీలకుడు రెడ్డి ఈశ్వరరెడ్డి నాయకులతో మాట్లాడినట్లు సమాచారం. అధిష్టానం దీనిపై ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

# మోటార్లకు మీటర్లు బిగించే నిర్ణయాన్ని వెనక్కుతీసుకోవాలి

## ఏప్రిల్ 5న చలో ఢిల్లీ'ని విజయవంతం చేయండి - రైతు సంఘాల నాయకులు



విలేఖరులతో మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం నాయకులు

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

మోటార్లకు మీటర్లు బిగించే విధానాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరెప్ప డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2014లో అధికారంలోకి వచ్చే ముందు దేశంలో ఏడాదికి కోటి ఉద్యోగాలు కల్పిస్తామని గొప్పలు చెప్పిన ప్రధాని మోదీ నేడు బిఎస్ఎన్ఎల్, విమానాలు, నౌకలు, రైల్వే తదితర ప్రభుత్వ రంగ బ్యాంకులతోపాటు ప్రభుత్వ కార్యాలయాలను ప్రయివేటీకరణ చేస్తూ అంబానీ, ఆదానీలకు అప్పగించారని విమర్శించారు. అంతేకాకుండా నల్లడబ్బుని తిరిగి దేశానికి రప్పించి పేదలందరికీ రూ.15లక్షల ప్రకారం ఖాతాల్లో వేస్తామని చెప్పిన మోసం చేశారన్నారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెంచారన్నారు. సోమేష్ సోమనాథ్ సిఫారసులను అమలు చేయకుండా రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. కౌలు రైతుసంఘం, వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో కార్మిక, కర్షక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. వ్యవసాయ కార్మికులకు ఏడాదిలో 200 రోజులు పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 కూలి పడే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల అధ్యక్షుడు కొత్తపేట మారుతి, సిఐటియు సీనియర్ నాయకులు ఎస్కో బాషా, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.అదినారాయణ, ఆయూబ్‌జాన్, ఎస్ఎస్ఐ జిల్లా అధ్యకుడు నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ కన్వీనర్‌గా శివకుమార్

**గుడిబండ :** గుడిబండ మండల సచివాలయాల కన్వీనర్ గా కొంకలు శివకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి తనను నియమించినట్లు శివకుమార్ తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి తాను కష్టపడి పనిచేయడంతో తనను గుర్తించిన ఎమ్మెల్యే ఈ బాధ్యతను అప్పగించారన్నారు. ఆయన తనపై ఉన్న నమ్మకాన్ని నిలబెడతానని చెప్పారు.

# రాష్ట్రస్థాయి హాకీ జట్టుకు ధర్మవరం క్రీడాకారుల ఎంపిక

**ధర్మవరం టౌన్ :** రాష్ట్రస్థాయి హాకీ జట్టుకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికైనట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రసిడెంట్ బందనాథం సూర్యప్రకాష్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్రస్థాయి హాకీ జటుకు ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాలలో నేటి నుంచి 16వతేదీ వరకు జరిగే 13వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హాకీ పోటీలలో పాల్గొనే సత్యసాయి జిల్లా జూనియర్ బాలుర హాకీ జటుకు ఆశోక్ (కెప్టెన్), రాజేశ్, లోకేశ్, ఈశ్వర్, మహమ్మద్ రఫీ, వెంకటేశ్ నాయక్, ప్రశాంత్ బాబు, వంశీ, మహబూబ్‌బాషా, జగన్, రపేస్, చక్రిరవితేజ, సునీల్, మహేష్, లావణ్యకుమార్, నాయక్, శుబాష్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ జట్టుకు కోచ్‌గా హుస్సేన్, మేనేజర్ కుషాల్‌కుమార్ వ్యవహరిస్తారన్నారు.

# థియేటర్లలో సౌకర్యాలు కల్పించాలి : సిఐటియు

**ప్రజాశక్తి-హిందూపురం**

పట్టణంలో ప్రేక్షలకు కనీస సౌకర్యాలు కల్పించని సినిమా థియేటర్లపై దాడులు నిర్వహించి చర్యలు తీసుకోవాలని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప డిమాండ్ చేశారు. సౌకర్యాలు కల్పించని సినిమా థియేటర్లలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు శుక్రవారం ఆందోళన చేసి తహశీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నరసింహప్ప మాట్లాడుతు వాహనాలకు పార్కింగ్ ఫీజు వసూలు చేయరాదని నిబందనలు ఉన్నప్పటికి పట్టణంలోని లక్ష్మీ థియేటర్ నిర్వహకులు పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారన్నారు. అయితే పార్కింగ్ ఫీజు వసూలు చేచడం తప్ప వాహనాలకు, వాహనంలో ఉన్నా వస్తువులకు ఎలాంటి బాధ్యత తీసుకోవడం లేదన్నారు. ఇక్కడ సిసి కెమెరాలు సైతం పని చేయడం లేదన్నారు. రూ.50 టికెట్‌ను రూ.200లకు విక్రయిస్తు ప్రేక్షకులను అడ్డంగా దోచుకుంటు సొమ్ము చేసుకుంటున్నారన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు


థియేటర్లలో ప్రేక్షకులకు కనీసం తాగాడానికి నీరు సైతం ఏర్పాటు చేయడం లేదన్నారు. ఇదే విధంగానే అన్ని థియేటర్లలలో ఉందన్నారు. రెవిన్యూ అధికారులు పరిశీలన చేసి ఇలాంటి థియేటర్లపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామకృష్ణ, అత్తర్ బాబా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, కల్లూరు ఆటో స్టాండ్ యూనియన్ నాయకులు నరేష్, రఫీక్, నగేష్, లక్ష్మీపతి, ఎన్ రమేష్, నవీన్, కే బాబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయాలతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యం

## ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

**ప్రజాశక్తి-బత్తలపల్లి**

సచివాలయాలతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దంపెట్ల గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన నూతన సచివాలయాన్ని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఎంపిపి గుర్రం వనజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం తీసుకురావాలన్న ఉద్దేశంతేనే సిఎం జగన్ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. గత ప్రభుత్వంలో పథకాల కోసం అన్ని అర్హతలు ఉన్నా ప్రజలు జన్మభూమి కమిటీ సభ్యులు, అధికారుల చుట్టూ తిరేగేవారన్నారు. అయినా అందేవి కాదన్నారు. అయితే జగన్ సిఎం అయ్యాక సచివాలయాలు, వాలంటీర్లను తీసుకొచ్చి అర్హుల వద్దకే సంక్షేమ పథకాలు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్లు సర్పంచులు చల్లా కరుణాకర్‌నాయుడు, పద్మావతి, పంచాయతీరాజ్ ఇఇ లోకన్న, తహశీల్దార్ యుగేశ్వరీదేవి, ఎంపిడిఒ సాయిమనోహర్, మండల ఇంజనీర్ రమణయ్య, కార్యదర్శి భారతి, వెంకటనారాయణ, కమతం ఈశ్వరయ్య, బండి వీరనారప్ప, ఓబుళాపురం బండి నాగభూషణం, డి.చెర్లోపల్లి చల్లా క్రిష్ణయ్య, అధికారులు, తదితరులు పాల్గొన్నాడు.



సచివాలయాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి. ఎంపిపి గుర్రం వనజ, సర్పంచి చల్లా కరుణాకర్‌నాయుడు

ప్రజాశక్తి
www.prajasakti.com





విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే

## క్రికెట్ టోర్నీ ప్రారంభం

**ప్రజాశక్తి- నంబులపూలకుంట**

మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించిన పూల మండలస్థాయి క్రికెట్ టోర్నీని సిఇసి సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక ఉల్లాసంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడాభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బత్తల వెంకట రమణ, కదిరి పట్టణ అధ్యక్షులు బహుద్దీన్, బాబాఫకృద్దీన్, శివారెడ్డి, సంతోష్, సతీష్, శరత్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయానికి నీటిట్యాంకుల వితరణ

**ప్రజాశక్తి -ధర్మవరం టౌన్**

పట్టణంలోని కాశీవిశ్వనాథ ఆలయానికి యువర్ ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం రెండు నీటి ట్యాంకులను వితరణ చేశారు. వంకదారి సుజాతమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త వంకబారి వీఆర్సే గుప్తా, కుమార్తెలు నీరజదేవి, షర్మిలాదేవి, హెలసాదేవి ఆధ్వర్యంలో ట్యాంకులను ఆలయ ప్రధాన అర్చకులు ద్వారకనాథ్ శర్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యువర్ ఫౌండేషన్ అధ్యక్షుడు వై.శ్రీనివాసులు, సభ్యులు డాక్టర్ బీవీ సుబ్బారావు, చాంద్‌బాషా, బండ్లపల్లి రంగనాథం, బండి నాగేంద్ర, రమేష్‌బాబు, శీలా నాగేంద్ర, జయంతి, వినోద్, తదితరులు పాల్గొన్నారు.



నీటిట్యాంకులు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు



సమావేశంలో పాల్గొన్న అధికారులు, రైతులు

## లేపాక్షిలో వ్యవసాయ మండలి సమావేశం

**ప్రజాశక్తి - లేపాక్షి**

మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని లేపాక్షి వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో అమలవుతున్న పథకాలు గురించి తెలియజేశారు. అదే విధంగా ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ, పట్టు పరిశ్రమ శాఖ ,పశు సంవర్ధక శాఖ అధికారులు వారి శాఖలోని అమలవుతున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్రి అడ్వైజరీ బోర్డ్ మెంబర్లు, ఏవో శ్రీలత, ఎఇఒ పుష్పలత, రైతులు రాముస్వామి, ఆర్‌బికె సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బీరువాలో దుస్తులు పడేసిన దుండగులు

## ఏకకాలంలో 8 ఇళ్లలో చోరీ

### లక్షల రూపాయల విలువజేసే సామగ్రి అపరహరణ

**మడకశిర :** ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఎనిమిది ఇళ్లలో దొంగలు స్వైర విహారం చేసి లక్షల రూపాయలు విలువ చేసే సొమ్ము, నగదును దోచుకెళ్లిన సంఘటన గురువారం రాత్రి మండల పరిధిలోని గంగలవాయిపాళ్యం గ్రామంలో చోటుచేసుకుంది. అందుకు సంబంధించిన వివరాలు... మండల పరిధిలోని గంగలవాయిపాళ్యం గ్రామంలో గురువారం రాత్రి ప్రతి ఏటా నిర్వహించే దేవి నాటక ప్రదర్శన జరిగింది .ఈ నేపథ్యంలోనే గంగలవాయి పాళ్యం గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలు ఈ నాటకానికి తిలకించడానికి అధిక సంఖ్యలో వచ్చారు. గ్రామీణులంతా నాటక వీక్షణలో లీనమై ఉండగా అదును కోసం కాచుకు కూర్చొన్న దొంగలు ఏకకాలంలో గ్రామంలోని ఎనిమిది ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఆ గ్రామానికి చెందిన దాసేగౌడ్, లక్ష్మీనారాయణ, దేవరాజు, గీతమ్మ, ఆదెమ్మ, ఆదిలక్ష్మమ్మ, లక్ష్మీనరసమ్మ, పార్వతమ్మకు చెందిన ఇళ్లలో దోపిడీకి పాల్పడ్డారు. అందిన కాడికి నగదును, ఇతర వస్తువులను దోచుకెళ్లారు . శుక్రవారం ఉదయం బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో అప్రమత్తమైన పోలీసులు గ్రామాన్ని సందర్శించారు. బాధితుల ఫిర్యాదు మేరకు 8 ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగేంద్రప్ప మాట్లాడుతూ లక్ష రూపాయలు విలువ చేసే సొమ్ములతో పాటు నగదు కూడా అపహరణకు గురైందన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

**ముదిగుబ్బ :** మండల కేంద్రంలోని దొరికిల్లు రోడ్డులో ఉన్న సత్తసాయి వాటర్ పంప్‌హౌస్ వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో రైతు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు... సూర్యనారాయణ (55) వ్యవసాయ పొలం వద్దకు వెళ్ల తిరిగి ద్విచక్ర వాహనంలో తిరిగి వస్తుండగా దొరికిల్లు వద్దకు రాగానే ముదిగుబ్బ నుంచి పులివెందుల వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో సూర్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ హేమంత్‌కుమార్ తెలిపారు.

## టిడిపి నాయకుడిపై దాడి

**కనగానపల్లి :** మండలంలోని కుర్లపల్లి గ్రామానికిచెందిన టీడీపీ నాయకుడు బాల్లగొండ శంకర్ పై వైసిపి నాయకులు భౌతిక దాడిచేసి కారు అద్దాలను ద్వాంసం చేసారు. బాధితుడు తెలిపిన వివరాలమేరకు తన వ్యక్తిగత పనిమీద శుక్రవారం కారులో వెళ్తుండగా వైస్ ఎంపిపి నరసింహారెడ్డి తో పాటు వారి బంధువులు తన కారు పై రాళ్లతో దాడిచేసారన్నారు అంతటి తో ఆగకుండా తనపై కూడా భౌతిక దాడులకు పాల్పడుతు కులం పేరుతో దుశించి చంపుతామని బెదిరెంచారన్నారు ఈ విషయం పై కనగానపల్లి పోలుసులకు పిర్యాదు చేశామన్నారు.

**దాడిని ఖండించిన టీడీపీ నాయకులు**

కుర్లపల్లి లో శంకర్ పై జరిగిన దాడిని టీడీపీ నాయకులు తీవ్రంగా కండించారు. కనగానపల్లి టీడీపీ పార్టీ కార్యాలయంలో బాధితుడు శంకర్ తో కలిసి నాయకులు తలారి రాజప్ప, ఎంపిటిసి బిల్లే భాస్కర్ మాట్లాడారు పార్టీ మార్పులు జీర్ణించుకోలేకే వైసీపీ వర్గీయులు దాడులకు తెగబడ్డారని ఆరోపించారు. ప్రజా స్వామ్యంలో మంచిది కాదని హితవు పలికారు.కార్యక్రమం లో గ్రామధ్యక్షుడు కాసుమూర్తి వెంకటేష్, విజయ్, వెంకటేష్ నాయక్, నారాయణ స్వామి నాయక్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**చిలమత్తూరు :** స్థానిక 44వ జాతీయ రహదారి పై కోడూరు తోపు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. బెంగుళూరు వైపు నుండి అనంతపురం వైపుగా ఇద్దరు వ్యక్తులతో వెళుతున్న ద్విచక్రవాహనం కోడూరు తోపు సమీపంలో అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో గోరంట్ల మండలం గొల్లపల్లికి చెందిన నారాయణప్ప( 54) అక్కడికక్కడే మృతిచెందాడు. అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి హమీద్ కు రక్తగాయాలు కాగా అంబులెన్స్ లో ఆసుపత్రి కి తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

## తూకాల్లో తేడాలొస్తే చర్యలు

**ధర్మవరం టౌన్ :** చౌకదుకాణాల ద్వారా నిరుపేదలకు అందించే బియ్యం, తదితర వస్తువుల తూకాల్లో తేడాలొస్తే డీలర్లపై చర్యలు తప్పవని ఆర్డీఓ తిప్పేనాయక్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్ వీధిలో ఉన్న చౌకధాన్య డిపో 19, 20ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా చౌకదుకానంలోని బియ్యం, కందిబేడలు పరిశీలించారు. చక్కెరను తూకం వేసి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నాణ్యమైన బియ్యంతోపాటు కందిబేడలు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు ఖచ్చితమైన తూకాలు అందించాలన్నారు. ఎవరైనా డీలర్లు తప్పుడు తూకాలు వేసినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సిఎస్‌ఒటి చెన్నకేశవనాయుడు, వీఆర్వో యోగీశ్వర్‌రెడ్డి, స్టోర్ డీలర్ల సంఘం అధ్యక్షుడు పరంధామరెడ్డి, తదితరులు ఉన్నారు.



సరుకుల తూకాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో



పార్టీలోకి చేరిన వారితో కందికుంట వెంకటప్రసాద్

## టిడిపిలో పలువురు చేరిక

**కదిరి టౌన్ :** గాండ్లపెంట మండలం గొడ్డువెలమలకు చెందిన పలువురు టిడిపిలో చేరారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో శుక్రవారం పలువురు నాయకులు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా కందికుంట వారికి పార్టీ కండువాలు వేసి టిడిపిలోకి ఆహ్వానించారు. నీరుకుంట్లపల్లి గ్రామం నుండి రవీంద్ర, నిరంజన్, శంకర, శ్రీనివాసులు, సుధాకర్ తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి ప్రసాద్, కంబయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## లేపాక్షిలో పొలంబడి

**లేపాక్షి:** మండలకేంద్రంలోని రైతు గోవిందప్ప పొలంలో వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతుకు చెందిన మొక్కజొన్న పొలాన్ని పరిశీలించి సస్య రక్షణ పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఒ శ్రీలత, ఎఇఒ పుష్పలత, పార్థసారథి, రఘు, హరి తదితరులతో పాటు రైతులు పాల్గొన్నారు.

## సిరివరంలో వైద్యశిబిరం

**లేపాక్షి :** మండలం పరిధిలోని సిరివరం గ్రామంలో వైద్యాధికారులు శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు వెంకట చిరంజీవి, నాగజ్యోతి ఆధ్వర్యంలో 104 సిబ్బంది 86 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రసాద్, భాగ్యలక్ష్మి, ప్రమీల, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన

**గోరంట్ల :** మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను పీడీ రామాంజనేయులు శుక్రవారం పరిశీలించారు ఈ సందర్భంగా మండలంలోని పాలసముద్రం వద్ద జరుగుతున్న చెక్‌డ్యాం పనులను పరిశీలించారు. పనులు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూలీలకు పలు సూచనలు చేశారు. నిర్దేశించిన ప్రామాణిక ప్రకారమే పనిచేసినట్లయితే ప్రతి కూలీకి రోజుకు 250 రూపాయలు కూలి వస్తుందని ఆయన తెలిపారు. ఉపాధి పనులను విరివిగా కల్పించాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ వరప్రసాద్, జెఒ మోహన్ బాబు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు

## 'యువగళం' పోస్టర్లు విడుదల

**ధర్మవరం టౌన్ :** పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుయువత ఆధ్వర్యంలో శుక్రవారం యువగళానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భగా టిడిపి నాయకులు మాట్లాడుతూ ఈనెల 27న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. దాదాపు 4వేల కిలోమీటర్లు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర సాగనున్నట్లు తెలిపారు. కావున టిడిపి నాయకులు, కార్యకర్తలు, తెలుగు యువత అనుబంధ సంస్థల నాయకులు లోకేష్‌కు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి చిన్నూరు విజయ్‌చౌదరి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుమలేష్, నియోజకవర్గ అధ్యక్షులు మమసూదన్, ఉపాధ్యక్షులు సంగాల బాబు, లోకేష్, లింగమయ్య, యుగంధర్, మండల తెలుగు యువత నాయకులు చిరంజీవి, పోతుకుంట హరి, పవన్, గణేష్‌చౌదరి, నాగరాజు, రాము, కాటమయ్య, పవన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

**ధర్మవరం టౌన్ :** పట్టణంలోని సంజయ్‌నగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను సిడిపిఒ చెన్నకేశవనాయుడు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా కేంద్రాలో బియ్యం, కందిబేడలను తనిఖీ చేయడంతోపాటు భోజనం రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చే బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం ఉన్నాయని ప్రచారం జోరుగా సాగుతోందని, అవన్నీ అపోహలు మాత్రమేనన్నారు. అలాగే కేంద్రాలకు వచ్చే చిన్నారుల తల్లులు, గర్భిణీలను పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నీలూరి వెంకటరాముడు, స్టోర్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, డీలర్ బైముతక రమణ, అంగన్‌వాడీ టీచర్, తదితరులు పాల్గొన్నారు.



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

## 'బత్తల' ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ



మహిళకు చీర పంపిణీ చేస్తున్న నాయకులు

**ప్రజాశక్తి కదిరి టౌన్**

సంక్రాంతి పండుగ సందర్భంగా తలుపుల మండలం ఓబుల రెడ్డి పల్లిలో వైసిపి సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సిఇసి సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, బత్తల వెంకటరమణ ముఖ్య అతిథులుగా పాల్గొని వెయ్యిమంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు అంతేకాకుండా ఓబులరెడ్డి పల్లి మసీద్ నిర్మాణం కోసం డాక్టర్ బత్తల హరి ప్రసాద్ రూ. 1.50 లక్షలు విరాళంగా అందజేశారు. కదిరి పట్టణ అధ్యక్షులు బాహుద్దీన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఇసి సభ్యులు పూల శ్రీనివాస్ రెడ్డి,నాయకులు డాక్టర్ బత్తల వెంకట రమణ,కుమ్మర వాండ్ల పల్లి మాజీ సర్పంచి బత్తల వెంకట రమణ మాట్లాడుతూ 30 సంవత్సరాల నుండి తమ కుటుంబం రాజకీయాల్లో కొనసాగుతోందని చెప్పారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి బిసి నాయకులు సంపంగి గోవర్ధన్, మండల కన్వీనర్ శంకర్, యూత్ అధ్యక్షుడు ఉత్తా రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, సర్పంచులు మనోహర్ నాయుడు, మల్లి నాయుడు, పట్నం షామీర్ బాషా, బత్తల యూత్ నాయకులు అఖిల్, ముబారక్, కిరణ్, కార్తీక్, షాజహాన్, బాబ్జాన్, సూరినేని కిరణ్, మెహబూబ్ బాషా, బత్తల శ్రావణ్, వాల్మీకి అంజి, సాబ్ జాన్, నరసింహతో పాటు ప్రజలు పాల్గొన్నారు.



కార్డుదారులతో మాట్లాడుతున్న అధికారి

## రేషన్ దుకాణం తనిఖీ

**ప్రజాశక్తి - గోరంట్ల**

మండలంలోని బూదిలి, గుమ్మయగారిపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ చౌక దుకాణాలను శ్రీ సత్యసాయి జిల్లా సివిల్ సప్లై జిల్లా మేనేజర్ అశ్వర్థ నారాయణ నాయక్ శుక్రవారం తనిఖీ చేశారు ఈ సందర్భంగా బూదిలి గ్రామంలో షాప్ నెంబర్ 38, గుమ్మయ్యగారిపల్లిలో షాప్ నంబర్ 32 తనిఖీ చేశారు. కార్డు దారులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై స్టాకిస్ట్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్రస్థాయి పోటీల్లో కదిరి విద్యార్థుల సత్తా

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

రాష్ట్ర 66 వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్క్వే మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో కదిరి విద్యార్థులు సత్తా చాటారు. నెల్లూరు ఎసి. సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన పోటీలలో 23 వ జాతీయ స్థాయి స్క్వే ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జమ్మూ లో జరిగిన జాతీయ పోటీలలో కదిరి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి మెడల్స్ సాధించారు మెడల్స్ సాధించిన విద్యార్థులకు, మాస్టర్ షాకిర్ కి ఎమ్మెల్యే. పి.వి.సిద్ధారెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మెడల్స్‌ను, ప్రశంసా పత్రాలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి, ఎస్‌కె.వలి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

## దౌర్జన్యకారులను వెంటనే అరెస్టు చేయాలి

**గుడిబండ :** మండల పరిధిలోని కొంకల్లు గ్రామంలో బోయ హనుమంతరాయప్ప ఇంటి పరిసర ప్రాంతంలో పెంచుకున్న కూరగాయల, కొబ్బరి, నిమ్మ, పూల చెట్లను ఏ కారణం లేకుండా జెసిబి తో తొలగించిన వైసిపి నాయకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్‌సి సెల్ నాయకులు డిమాండ్ చేశారు. వారితో పాటు ఇద్దరు వాలంటీర్లను వెంటనే అరెస్ట్ చేసి హనుమంత రాయప్ప కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. అనంతరం తమ పార్టీ నాయకులతో కలిసి వారు స్థానిక తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయానికి .వెళ్లి బాధితునితో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమంతరాయప్ప తెలుగుదేశం పార్టీకి సానుభూతిపరుడిగా ఉంటూ ఇటీవల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో పాల్గొన్నాడన్నారు. అది చూసి ఓర్వలేక అతనిపై కక్ష కట్టి ఏ కారణం లేకుండా ఇంటి ముందు పెంచుకున్న చెట్లను తొలగించారన్నారు. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొని వారిపై కేసులు నమోదు చేసి హనుమంతరాయప్ప కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో సోమవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి ఆధ్వర్యంలో చలో గుడిబండ కార్యక్రమాన్ని చేపట్టి నియోజకవర్గం లోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి పెద్ద ఎత్తున గుడిబండ పోలీస్ స్టేషన్ ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పవన్‌కల్యాణ్‌ను విమర్శిస్తే సహించేదిలేదు..

### జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి 'చిలకం'

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

రాష్ట్రమంత్రులు రోజా, అంబటి రాంబాబు, పేర్ని నాని, గుడివాడ అమర్‌నాథ్ తమ యోగ్యత మరిచి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌పై విమర్శలు చేస్తే సహించేది లేదని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం, వలసలపై సిఎం జగన్ చేస్తున్న మోసాన్ని యువశక్తి మీటింగ్‌లో జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ లేవనెత్తితే మంత్రులు మితిమీరి విమర్శలు చేయడం బాధాకరమన్నారు. ముఖ్యంగా రోజా సంస్కారం లేని మాటలు మాట్లాడుతోందన్నారు. ఇదే రోజా టిడిపిలో ఉన్నప్పుడు వైఎస్



విలేకరులతో మాట్లాడుతున్న 'చిలకం'

రాజశేఖర్‌రెడ్డిని ఎలా తిట్టిందో గుర్తించుకోవాలని సూచించారు. ఇప్పుడు వైసిపిలో ఉంటూ జబర్దస్త్ వేషాలు వేస్తోందని ఎద్దేవా చేశారు. అలీఆగే అంబటి రాంబాబు.. జనసేన శ్రేణులతో పెట్టుకుంటున్నావ్.. జాగ్రత్త అంటూ హెచ్చరించారు. అనంతపురం జిల్లాకు ఎప్పుడో ఒకసారి వస్తావు కదా.. అప్పుడు నీ భరతం పడతారన్నారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు, మంత్రులు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, లేకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

## పశువులను తరలిస్తున్న వాహనం సీజ్

**ప్రజాశక్తి - గోరంట్ల**

అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని మండలంలో పాలసముద్రం వద్ద శుక్రవారం పట్టుకున్నట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు. గుడిబండ మండలం నుండి కేరళ రాష్ట్రానికి అక్రమంగా కంటైనర్ వాహనంలో పశువులను తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి మంజునాథ్, అబ్దుల్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న పశువులను గోశాలకు అప్పగించామన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

**ప్రజాశక్తి - కదిరి అర్బన్**

సంక్రాంతి పండుగ నేపథ్యంలో అసాంఘిక కార్యకపాలకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని రూరల్ సిఐ శివశంకర్ నాయక్ కోరారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడి ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి



ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

**బత్తలపల్లి :** సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో ప్రజలకు మంచి చేస్తున్న సిఎం జగన్‌కు మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో వైస్ ఎంపిపి గజ్జెల వెంగళరెడ్డి, సర్పంచు చల్లా కరుణాకర్‌నాయుడు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. తర్వాత ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. తర్వాత నాడు-నేడు పనులను పరిశీలించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి టిడిపి హయాంలో కనీసం పది శాతమైనా జరిగిందా.. అని ప్రశ్నించారు. మూడున్నరేళ్లగా పార్టీలు, కులమతాలకు అతీతంగా ప్రజలందరికీ సమానంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు వివరించారు. భావితరాల బంగారు భవిత కోసం రాష్ట్రంలో 30 ఏళ్ల పాటు సీఎం జగన్ పాలన చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇందులో భాగంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో వీధుల్లో సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ లైన్లు వేయించాలని కోరారు. మరికొందరు తమకు ఫించన్లు అందలేదని తెలపడంతో వారి ముందే అధికారులతో అందుకు కారణాలను వివరించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గొల్లపల్లి రామకృష్ణారెడ్డి, ఎంపిపి గుర్రం వనజ, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, కమతం ఈశ్వరయ్య, బండి వీరానారప్ప, ఓబుళాపురం బండి నాగభూషణం మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**హిందూపురం :** హిందూపురం పురపాలక సంఘంలోనే వెనకబడిన ప్రాంతమైన 25వ వార్డును అన్ని విధాల అభివృద్ధి చేస్తామని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ ఇక్బాల్ హామీ ఇచ్చారు. 25వ వార్డు ప్రాంతంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ, స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి కార్తీక్, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.